

# జలగలు

## వి. ప్రతిమ

తెల్లవారుతుంది.

తప్పకుండా తెల్లారుతుంది.

ఎందుకు తెల్లారదూ..?

సూర్యుడి కిప్పుడు తొందరెక్కువయింది... రాత్రి పదకొండింటి వరకు వుండి కూడా పొద్దున్న అయిదింటికే వచ్చేస్తున్నాడు.

రేపుకూడ అలానే వస్తాడు.. రేపొస్తే ఏమవుతుంది.

రేపొస్తే సోమారమొస్తుంది.

ఎనిమిది గంటలయితే భారతి యింట్లో చాపేస్తుంది.

అమరావతి, రంగమ్మ, ఎదురింటి విశాలాక్షి, ఎంకటమ్మ, భారతి అందరూ నమస్కారాలు చెయ్యాల.. ఒప్పందం చదవాల.. ఆ తర్వాత... ఆ తర్వాత కంతులు కట్టాలి.

వేసవికాలం అగ్గిపెట్టి లాంటి ఆయింట్లో అంత ఉక్కపోతలోనూ అమరావతి శరీరం వొణికింది సన్నగా... ఆ అమావాస్యనాటి అర్ధరాత్రి చీకటి కన్నా చిక్కగా, చిక్కుగా వుందామె మనసు.

అంత చిక్కులో ఆమె ఆలోచన మరో చోటకి, చిక్కుముడులన్నీ విప్పగలిగే హాయయిన చోటికి లాగుతోంది...

ఆ సాయంత్రం అయ్యపురెడ్డి పొలం కాడ్నించి

గుళికల మందు తీసుకొచ్చాడు కొడుకు... దాంతో పాటు అరిటిపండ్లు కూడ కొనుక్కొచ్చాడు... వాడి పిచ్చిగాని తమబోటోళ్ళ బతుకులు కంటే చేదుగా వుంటుందా గుళికల మందు అరిటిపండులో పెట్టు కుని తినడానికి..

సాయంత్రం చీకటి పడిన తర్వాత యింటిల్లిపాదీ ఆ అరటిపండ్ల నైవేద్యాన్ని ఆరగిద్దామనే అనుకు న్నారు... ఇంతలో ఎక్కడ్నుండొచ్చాడో పిలవని పేరం టానికి వెంకటేశ్వర్లు.. అమరావతి చెల్లెలు భర్త...

"చావు దేనికీ పరిష్కారం కాదనీ.. పోలీస్‌స్టేషన్లో కంప్లెయింటిద్దామనీ(?) ఈ సుజాత వంటి వాళ్ళు మన ల్నేమీ చేయలేరనీ... అంటూ మొన్నామధ్య కృష్ణా జిల్లా కలెక్టరు ఈ సూక్ష్మ ఋణ సంస్థలన్నింటి మీదా దాడులు చేసి మూయించి వేశాడని.. మన జిల్లాలో కూడ అదే జరుగుతుందనీ.. ఏ మాత్రం భయపడొద్దనీ.." పనికి రాని చాట భారతమైన ధర్మబోధ చేసి పోయ్యాడు.

పోయేది అతని పరువు కాదుగదా మరి...

అతడి హిత బోధతో తల్లీబిడ్డలు కొంత స్థిమిత పడి మనసులు మార్చుకుని, ధైర్యం తెచ్చుకుని తలో అరిటిపండూ తిని గ్లాసుడు మంచి నీళ్ళు తాగి చాపల మీది కొరిగారు.

అమరావతికి మాత్రం మరిది మాటలు ఏమాత్రం రుచించకపోగా కించిత్ ధైర్యాన్ని కూడ యివ్వలేక పోయాయి.. ఈ తెల్లారడానికింకో ప్రత్యామ్నాయం లేదా అన్న ఆలోచనలో అల్లకల్లోలంగా వుంది మనసు.

అలమరలో మిగిలిపోయిన రెండు అరిటిపండ్లూ, దాంతో పాటు గుళికల మందూ వూరిస్తూనే వున్నాయి.

ప్చ్ బతకడానికెలాగూ లేదు. చావడానికయినా ధైర్యం చాలడం లేదు.

అమరావతి కదలికలని, ఆలోచనలని కనిపెడ్తొన్న వాడిలా చాపమీద నుంచే పొడిదగ్గు దగ్గాడు కొడుకు భాస్కర్... నేను మెలకువ గానే వున్నాను సుమా అంటూ యింట్లో వాళ్ళందరినీ హెచ్చరిస్తున్నట్లుగా వుందా దగ్గు...

సమాధానం చెప్తున్నట్లుగా తనూ దగ్గింది అమరా వతి.

దగ్గినా, తుమ్మినా, ఏడ్చినా కళ్ళు మాత్రం అంటు కోవడం లేదెవరికి.

అసలు వారపు కంతులు కట్టాల్సిన ప్రతీసారీ ముందురోజు రాత్రి నిద్రుండదు అమరావతికి... ఈసారి యింటిల్లిపాదికీ లేదు.

తెల్లారీ, తెల్లారకముందే స్పందన వస్తుంది.

ఆ రాక్షసి ఒంటరిగా రాదు.

వస్తూ, వస్తూ జగజ్జెట్టిల్లాంటి యిద్దరు రౌడీలను వెంట పెట్టుకొస్తుంది... వాళ్ళు కఠారి పాళెం రౌడీలు.. వాళ్ళు ముందూ, వెనకా చూడకుండా యింట్లోని సామానంతా వీధిలోకి విసురుతారు.

"మనషుల్ని విసరడానికి కూడ వెనకాడరు వాళ్ళు.. మానాన్ని ఒలిచి నడీధిలో పెట్టేస్తారు. ఎముకల్లోపలి మూలుగను పీల్చినట్టుగా వడ్డీని వసూలు చేస్తారు.

ఒకటా? రెండా గొట్టు పొక్కుల మాదిరిగా వారా నికి రెండు వందల పాతిక లెక్కన యింటిల్లిపాదీ కష్టం చేసి, కడుపు కట్టుకుని దాని మొహన కొడితే యిప్పు డింకా నలభయి రెండు వేలు కట్టాలని లెక్కలు తేల్చి తెల్లకాగితాల మీద సంతకాలు పెట్టిచ్చుకుపాయె... యింక ఎప్పటికి తీరేను? ఎట్టుతీరేను.."

తల్లి పెద్దగానీ మాట్లాడ్తుండడంతో యిక కట్టెలా బిగుసుకుని పడుకోవడం చాతకాక భాస్కర్ లేచి కూర్చున్నడు.

"స్పందనే కాదు మా గ్రూపులో మెంబర్లు కూడ నన్ను నానా మాటలూ అంటున్నారు..."

కడుపులో బాధ గుండెల్లోకి ఎగదన్ని నొప్పి తీస్తోంది...

తల్లి మాటలతో భాస్కర్‌కి కూడా గొంతు పట్టేసి నట్టయింది.

"ష్షీ" అంటూ ఊపిరి తీసుకుని ఎడమ చేతి దన్నుతో పైకి లేచి పక్కనే వున్న చెంబునెత్తుకుని రెండు గుట్కలు నీళ్ళు తాగింది అమరావతి... "నీళ్ళు గూడ వేడిగా వుండాయి" గొణుక్కుంది.

పగలంతా విరగగాసిన ఎండ తాలూకూ సెగలు పొగలయి ఆ రాత్రిని ఆవహించినట్లుగా వుంది.

"ఆ దొంగముండ బెదిరిచ్చి సంతకాలు పెట్టిచ్చు కు పాయ... యిక గమ్మునుంటాదా? రేప్పొద్దన్నే వచ్చి యిల్లు ఖాళీ చేయమంటాది గావాల... నిలవను నీడ గూడ ల్యాకుండా వున్నెట్టుంది యాడకి పోవాల? ఆ పెద్దమనిషొచ్చి ఛావను గూడ ఛావనీక పాయ.. ప్చ్" తలపట్టుకుంది అమరావతి.

ఇంకా నీలుక్కుని పడుకుని వుండడం సాధ్యంకాక వసంత, నీరజ కూడ లేచి కూర్చున్నారు.

ఇన్నేళ్ళ కాలంలో తల్లి నోట్లోనుండి యింత పరువ మైన మాటలు యిప్పుడిప్పుడే వింటున్నారు అంతా... ఆ స్పందనని తల్లి అలా తిడ్తోంటే హాయిగా అన్పిం చింది భాస్కర్‌కి.

"నిజమేఁ అది సినిమాల్లోనో, సీరియళ్ళలోనో చూపించే ఆడవిలన్లా వుంటుందే కానీ ఆడమనిషిలా అన్పించదు. ఆడవాళ్ళలోని సుకుమారత్వం, సున్ని తత్వం ఏకోశానా కన్పించవుదాన్లో.. ఒక్కవారం వాయిదా ఆలస్యమైనా మీద పడిపోతుంది.. అర్ధరాత్రి నిద్రలేపినా దాని నోట్లో నుండి వచ్చే ఒకే ఒక్కమాట "కంతులు... కంతులు" మెల్లిగానే అన్నాడు భాస్కర్...

స్పందన అసలు పేరు సుజాత.

మొగుడు సొసైటీలో పెయిడ్ సెక్రటరీగా పనిచే సేవాడు.

సుజాత మానస టెయిలర్స్‌లో జాకెట్లకి హుక్స్ కుట్టుండేది. పొదుపు లీడర్‌గానూ వుండేది... వచ్చిం దాంతో యిద్దరూ హాయిగానే వుండేవాళ్ళు...

ఈ షేర్‌వాళ్ళు, స్పందనా వాళ్ళు వచ్చి వూళ్ళో ఆడోళ్ళని గ్రూపులు గ్రూపులుగా చేసి పేదోళ్ళందరినీ పిలిచి అప్పులిచ్చేదాక కూడ సుజాత మామూలు ఆడ మనిషే.. భర్త ఒత్తిడితో స్పందన సంస్థ గ్రూపులీడ రుగా మారి తన పేరు మార్చుకుంది.

అమరావతి చుట్టూ తిరిగి తిరిగి నచ్చచెప్పి తమ గ్రూపులో చేర్చుకుని వద్దంటే అప్పులిచ్చేదాక కూడ సుజాత మామూలు ఆడమనిషే...

అప్పటికి సుజాత మనసులో కొంత తడివుంది.

తమ గ్రూపు వాళ్ళని మోసం చేయాలని కానీ, పీడించి దండించి దండుకోవాలని కానీ లేదు.


"ఇప్పుడు సెంటర్‌కి లీడరయిందంటనే" అడి గింది అమరావతి.

"అవును అయిదుమందిని ఒక గ్రూపు అటువంటి ఎనిమిది గ్రూపుల్ని కలిపి ఒక సెంటరు చేస్తారు. ఆ సెంటరుకి లీడరు సుజాత. ఇప్పుడు యిన్ని గ్రూపుల్లో ఏ ఒక్కరు డబ్బులు కట్టకపోయినా నానా మాటలూ అడిగి డబ్బులు కక్కిస్తావుంది. యింతకు ముందు యిట్టలేదు. డబ్బు కూడ్దం మొదలు పెట్టిన తర్వాత ఆశ ఎక్కువయి పోయింది. మరీ క్రూరంగా మారిపో యింది" యింట్లో అందరికీ తెలిసిందే అయినా మళ్ళీ చెప్పాడు భాస్కర్.

"క్యూ...ఋ..." అంటూ నక్క వూళ పెట్టినట్టుగా వికృతంగా అరిచింది గుడ్లగూబ ఒకటి... గత మూడు నెలలుగా ఈ గుడ్లగూబ వాకిట్లో వున్న ఎండిపోయిన మామిడి చెట్టుమీద చేరి ఉపద్రవమేదో ముంచుకురా బోతునట్లుగా కూతలు పెడుతూనే వుంది. అదొకసారి యింట్లోకి కూడ వచ్చి వెళ్ళిందని వసంత భయప డుతూ చెప్పింది.

పహారా తిరుగుతోన్న పోలీస్ జీపొకటి ఆపకుండా విజిలేసుకుంటూ మెయిన్‌రోడ్డు మీద వేగంగా పరిగెడు తోంది. ఆ అర్ధరాత్రి దాటిన నిశ్శబ్దంలో ఆ జీపు శబ్దం అమరావతి గుండెల్ని దడదడ లాడించింది....

"విశాలా.. విశాలా..." ఉన్నట్టుండి విన్పించిన ఆ గావుకేకలు అసలే కలత నిద్రలో వున్న వీధిని వజ వజ వలాడించాయి.. రోడ్డుమీద నిటారుగా నడుచు కుంటూ వెళ్ళిపోతోన్న విశాల వెంట పిచ్చివాడిలా పరుగెడ్తున్నాడు ఎదురింటి ప్రభాకరం.



"అయ్యొయ్యో ఆ విశాలాక్షి మళ్ళీ వెళ్ళిపోతోందా" గబుక్కున పక్కమీంచి లేచి తనూ రోడ్డున పడ్డది అమరావతి...

"ప్చ్" అనుకుంటూ తల పట్టుకున్నాడు భాస్కర్.

అయిదార్రోజుల ముందు స్పందన ఎదురింటి విశాలాక్షినీ, ప్రభాకరాన్ని వారం కంతులు కట్టలేదని యింట్లోంచి బయటకిలాగి బట్టలూడదీసి అవమానించడమే కాకుండా, పోతూపోతూ వారి ఏడాది చిన్నపాప 'బన్ను'ని ఎత్తుకుపోయింది...

మొత్తం వడ్డీ, మొదలూ కట్టి బిడ్డను విడిపించుకోమని హెచ్చరించి పోయింది... గోడుగోడుగా ఏడుస్తూ కాళ్ళు పట్టుకుని విశాలని విదిలించి కొట్టింది స్పందన... వెంట బడ్డోన్న ప్రభాకరాన్ని చొక్కాపట్టుకుని లాగి యింట్లోకి తోశాడు స్పందన మొగుడు వీరయ్య

ఆరోజు నుండీ ఏడుస్తూనే వుంది విశాల.

అర్ధరాత్రి, అపరాత్రి అని లేకుండా పాపకోసం అంగలారుస్తూ వీధులవెంట పరుగులు తీస్తోంది.... విశాల లేచినప్పుడల్లా పట్టి, బలవంతంగా మత్తు మాత్ర వేసి పడుకోబెడుతున్నాడు ప్రభాకరం....

"ప్రభాకరన్నకి ఎక్కువగా కడుపులో నొప్పి వస్తుంటే నెల్లూరుకు తీసకపోయి చూపించాలని తీసుకుందన్నా స్పందన వోళ్ళ దగ్గర... ఆస్పత్రి ఖర్చులూ, అన్న పనికిపోక జీతం రాకపాయ... కంతులు సరిగా కట్టలేక పోయింది.." సంజాయిషీ స్తున్నట్టుగా చెప్పింది వసంత భాస్కర్‌తో..

విశాల, అమరావతి, భారతి, రంగమ్మ, ఎంకటమ్మ వీళ్ళయిదుగురూ ఒక గ్రూపు... ఈ గ్రూపుకి స్పందన సంస్థ అప్పులిచ్చిన నెల తర్వాత కాలనీలోకి షేర్ మూల సంస్థ ప్రవేశించింది... మేము యిప్పటికే స్పందన సంస్థ మెంబర్లం బాబూ అని మొత్తుకున్నా 'ఫర్వాలేదు మేమూ యిస్తాం తీసుకోండి' అంటూ యాభయివేలిచ్చి అందరితో సంతకాలు పెట్టించుకుని ప్రమాణాలు చేయించుకున్నారు.

"స్పందన వాళ్ళకి కంతులు కట్టడానికి షేరోళ్ళ దగ్గర తీసుకుంది. విశాలక్క... ఇప్పుడు అదీ, ఇదీ వారానికి రెండు కంతులు కట్టాల్సొచ్చే సరికీ కళ్ళు వెల్లురొచ్చినాయి..." అన్న ఆలోచనలను గమనించినట్టుగా అన్నది వసంత...

స్పందనది సోమారం గ్రూపయితే, షేర్‌మూలది బుధారం గ్రూపు. స్వయంకృషి వాళ్ళది బేస్తారం... వారాలంటేనే వొణుకు అందరిలో...

"ప్చ్ ఎప్పుడు చేతికి డబ్బులందుతాయో ఏమొ.. ఈ గుమాస్తా ప్రభాకరం డబ్బుకట్టి ఆ బిడ్డను యిడిపించుకుంటాడో లేదో?... అప్పటిదాకా ఈ విశాల బతకతాదా.. ఆ భగవంతుడికే తెలియాల..." విశాలని మాత్ర మింగించి పడుకోబెట్టడంలో సాయంచేసి తిరిగొచ్చిన అమరావతి గొంతు దుఃఖంతో పూడుకుపోయింది.. చేతులు పై కప్పుకేసి చూపిస్తున్నాయి..

తన నిజ పరిస్థితి మరిచి వేరే ఎవరికోసమో దుఃఖపడుతోన్న తల్లిని చూస్తుంటే చెప్పలేనంత జాలి కలిగింది భాస్కర్‌కి...

"దేవుడు నిజంగా వున్నాడంటావా అమ్మా" అన్నాడు తల్లిని ఏదో విధంగా పలకరించాలని.. అలాంటి వాడెవడయినా వుండివుంటే ఈ రాత్రికి రాత్రి దిగివచ్చి తమ నాదుకుంటే బావుండునన్పించిందతడికి.

"అంతేలే భాస్కరా... వుండుంటే ఇరవై నాలుగ్గంటలూ ఆయన నామ జపం చేస్తూ, పూజా నమస్కారాలతో మునిగి గుళ్ళ చుట్టూ తిరుగుతుండిన రవణమ్మ చచ్చిపోయినపుడు శవాన్ని ఎత్తడానికి లేదని షేర్ వాళ్ళు అడ్డుకుంటే గమ్మున చూస్తా వుంటాడా వాడెట్టాడ దేవుడు... దేవుడూ లేడూ, దెయ్యమూ లేదు. మనబోటోళ్ళకి కడుపు మాత్రమే వుంటాది. చించుకుంటే కాళ్ళమీద పడడానికి.. ప్చ్" ఈసారి పడుకోకుండా గుంజకానుకుని కూర్చుని మోకాళ్ళలో తలదూర్చుకుంది అమరావతి.

ఏ మూడురోజుల్నాడు దువ్వుకున్నదో తల చిర్రు చిర్రుగా పైకి లేస్తోంది.. పుల్లలాంటి చేతుల మీద వొదులొదులుగా వెళ్ళాడుతోంది మాసిపోయిన రవికె. కళ్ళు మూసుకున్న అమరావతికి స్పందన బదులుగా రమణమ్మ కళ్ళముందు మెదిలింది.

"అమ్మా రమణత్త కొడుకు తిరిగిరానే లేదామ్మా" సగం తెలిసి సగం తెలీని నీరజ తల్లిని ప్రశ్నించింది...

"యాదొచ్చినాదమ్మా వాడ్ని దుబాయికి పంపడానికనేకదా షేరోళ్ళ దగ్గర ఇరవై వేలు తీసుకుంది... ఆ ఏజంటు సచ్చినోడు బొంబాయి దాకా తీసకపోయి వదిలిపెట్టి పత్తాల్యాకుండా పాయ.. కొడుకు తల్లికి మొహం చూపించలేక ఏంచేసుకున్నాడో.. ఎట్టు పోయినాడో... ప్చ్.. కంతులు కట్టలేక విషం మింగింది..." రమణమ్మ శవం కళ్ళముందు మెదిలి ఆకలి కడుపుతో మరింత దేవినట్టయింది అమరావతికి...

"అదేందో తల్లా... యిచ్చేటప్పుడు మాత్రం 2 రూ. వడ్డీకి యిస్తామని అన్నారు... కట్టడం మొదలు పెట్టాక అయ్యే వడ్డీలో మిదిమాలపు వడ్డీలు.. చక్ర వడ్డీలు, బారు వడ్డీలు.. వడ్డీలకు వడ్డీలు.." వసంత తనకి అవగాహన వొచ్చిందేదో చెప్పబోయింది...

కరెంటు లేదు యింట్లో.. పవర్ కట్టయిందని కాదు. తమ యింట్లో మాత్రమే కరెంటు లేదు.

రెండు నెలలుగా బిల్లు కట్టలేదని పోయిన్నెల్లోనే పీకేశారు.

ఆ రోజుట్నుంచే కాదు.. అంతకు ముందు నుంచే చీకటి ఆ యింటినీ, ఇంట్లోని మనుషుల్ని ఆవహించేసి వుంది...

వీధి దీపపు కను వెలుతురులో తల్లి ఆకారమూ, వెక్కుతోన్న చప్పుడూ, నిద్రలేని చెల్లెళ్ళూ... త్వరత్వరగా వేకువని సమీపిస్తోన్న రాత్రీ భాస్కర్ని అపరాధ భావంతో కుదిపేస్తున్నాయి..

భాస్కర్ మూలంగానే తల్లి స్పందనలో అప్పు తీసుకుంది.

భాస్కర్ డిగ్రీలో చేరాడు కానీ కుటుంబ పరిస్థితుల వల్ల చదువు మానేయాల్సివచ్చింది... అప్పటికే వసంత పాచిపనికి వెళ్తూ టెయిలరింగ్ నేర్చుకుంటోంది.. తల్లితో కలిసి బీడీ పని కూడా చేసింది. నీరజ పదోతరగతి చదివిందే ఎక్కువ... బాధ్యతగా బట్టల కొట్లో అమ్మకపు అమ్మాయిగా చేరి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళందిస్తోంది.. ఈ నేపథ్యంలో భాస్కర్‌కి చదువుకోవాలన్పించక బంగారంగట్లో పనికి చేరాడు కొన్నాళ్ళు.

సరిగ్గా అప్పుడే ఈ స్పందన, షేర్‌మూల, షేర్, సత్యకృష్ణ, అస్మిత, 'ఉండమ్మా బొట్టు పెడతా' వంటి సంస్థలు రంగప్రవేశం చేసి వీధి వీధి తిరిగి తక్కువ వడ్డీలకు సులభవాయిదాల పద్ధతిలో అప్పులిస్తామంటూ భాస్కర్ వంటి నిస్సహాయ పరిస్థితుల్లో వున్న వాళ్ళను తెగపూరించాయి.

ప్రభుత్వ బ్యాంకుల సంగతి ఎప్పుడూ తెలిసిందే... ప్రైవేటు బ్యాంకులు కూడ ఒక్కొక్కటీ తలుపులు మూసేస్తోన్న సమయం అది. కృషి బ్యాంక్ ఫైర్మన్ దేశాలు పట్ట పోతే రాత్రికి రాత్రి గ్లోబల్ ట్రస్టు బ్యాంకు మూతపడింది. అందులో అధిక వడ్డీలొస్తాయని ఆశపడిన డిపాజిటర్లు చాలామంది గుండె ఆగి మరణించారు.

దాంతో ఈ ప్రైవేటు బ్యాంకులు, వడ్డీ వ్యాపారస్తులే వేషం మార్చి చిన్న చిన్న ఋణ సంస్థల రూపంలో రంగ ప్రవేశం చేశాయి. భారతీయ కంపెనీల చట్టంలోని



## బోలెడంత అనుభవం: సమంత

అందాల భామ సమంత ఏ మాయ చేస్తుందో గానీ ఏం చెప్పినా కొత్తగానే అనిపిస్తుంది. ఈమె తల్లిది కేరళ. సమంత తండ్రి తెలుగువారేనట! కొన్ని తరాల క్రితం తమిళనాడులో స్థిరపడ్డ ఫ్యామిలీ కావడంతో ఇంట్లో తెలుగు మాట్లాడరు. ఆంగ్లంలోనూ, తమిళంలోనూ మాట్లాడుకుంటారట! ఇటీవల ఈ భామ తెలుగు సినిమాలు చేస్తుండటంతో కాస్త తెలుగు నేర్చుకుంటోంది. తెలుగు మాట సరే... సినిమాలు ఇంకేం నేర్పాయి అని ఈ అమ్మడిని ప్రశ్నిస్తే "చేసింది తక్కువ సినిమాలే అయినా బోలెడంత అనుభవం వచ్చింది. 'ఏమాయ చేశావె', 'బృందావనం' సినిమాలతో చాలా నేర్చుకున్నాను. ఎవరితో ఎలా మెలగాలి? ఎలాంటి పాటలకు స్టెప్పులు ఎలా వేయాలి? డైలాగులు ఎలా చెప్పాలి?... ఇలా ఒకటేమిటి చాలా నేర్చుకున్నాను. నేను చిన్నప్పటి నుంచి అంతే! ఇతరులను చూసి స్ఫూర్తి పొంది వాటిని అనుసరిస్తుంటాను" అని అంటోందీ చిన్నది. అన్నట్టు మహేష్‌తో ఆడిపాడటానికి ఈ మధ్య ఇటలీకి వెళ్లింది సమంత. నిన్నమొన్నటిదాకా అమితంగా ఆరాధించిన మహేష్ సినిమాలో నటిస్తుండటం ఇంకా తనకి నమ్మలేని నిజంగానే ఉందట!

సెక్షన్ 25 ఆధారంగా నాన్ – బ్యాంకింగ్ కార్యకలాపాల నిర్వహణ కింద యివి ఏర్పాటయ్యాయి... రిజర్వు బ్యాంకు అనుమతినిచ్చింది...

బంగ్లాదేశ్ వంటి దేశాల్లో యివి మంచి ఫలితాల నిచ్చాయి కానీ మన దేశంలో అందునా మన రాష్ట్రంలో అవినీతి పేరుకుపోయి పదవే ధ్యేయంగా సాగుతున్నాయి...

వెక్కుతోన్న తల్లివీపు మీద చేయివేసి అనున యంగా నిమిరాడు భాస్కర్... ఆమె వెక్కిళ్ళు మరింత ఎక్కువవడంతో భాస్కర్ కళ్ళు కూడ తడి దేరాయి..

తల్లిని స్పందనలో మెంబరుగా చేరమని భాస్కరే పోరు పెట్టాడు.. అప్పుతీసుకుని వెయ్యికోళ్ళు తెచ్చి ఫారం పెడ్తానన్నాడు. ఆ వెయ్యిని పదివేలు చేస్తానన్నారు.

కోళ్ళ ధర బాగా పలుకుతోంది కాబట్టి వాయి దాలు కట్టడం పెద్ద కష్టం కాబోదని. కోళ్ళఫారం బాగా జరిగితే చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేయడం తేలికవుతుం దనీ అమ్మకి ఎన్నెన్నో ఆశలు కల్పించాడు. తనూ ఆశ పడ్డాడు.. అయితే ఆ కోళ్ళకి రారని తెగులొచ్చి ఒక్క సారిగా ముంచేస్తాయని వూహించలేదతడు.

"అన్న చెప్తే మాత్రం నువ్వెట్ల తీసుకుంటావు మా... అంతా అన్నదే తప్పనబాక.. అందరిదీ తప్పే... ఫారాలు పెట్టి బాగా పెరిగిపోతాయని ఆశపడ్డాం.. దురాశ దుఃఖానికి చేటని నువ్వే చెప్పే దానివి కదా... అప్పు తీసుకోకముందు రెండు పూటలయినా తింటుండినాం... ఇప్పుడు కంతులు కట్టడం కోసం కడుపు కట్టుకుంటున్నాం" ఎక్కసంగా అంది వసంత..

వసంతకీమధ్య బీడీ ఫ్యాక్టరీలో పనిచేసే నజీర్‌తో పరిచమయింది.. అతడికి ముందే పెళ్ళయింది... వసంత తనతో వుంటే వారపు కంతులు తాను చెల్లిస్తా నని వూరిస్తున్నారు.. అమ్మని, తోబుట్టువుల్ని కాపాడు కోవడం కోసం ప్రస్తుతానికి అదే సరయిన మార్గమన్న సందిగ్ధంలో పడిందామె...

"అవును అంతా నాదే తప్పు... నన్నే అనండి అందరూ" తలబాదుకుంది అమరావతి నిస్సహాయంగా..

నిజానికి భాస్కర్ చెప్పినప్పటికీ ముందు అమరా వతికి ఈ అప్పు తీసుకోవడం పట్ల ఆసక్తి లేదు. అయితే తను పని చేసే ఇంటి యజమానినీ, మరొక బ్యాంకాయినీ అడిగి అవి చట్టబద్ధంగానే పని చేస్తు న్నాయని నమ్మి కొడుకు మాటని ఆమోదించింది...

"ఇరవై వేలు అప్పు తీసుకోడమేంది... పదహారు నెలలు వారాని కింతని కట్టీ కట్టీ మళ్ళీ యిరవై వేలు కట్టాలనడమేంది?... అర్థమే కాకుండా వుండాది"... అమరావతి ఏం మాట్లాడుతోందో, ఏం మాట్లాడాలో తెలీని దానిలా వదరుతూనే వుంది. షేర్ వాళ్ళగురించి..

"అప్పులివ్వడంలో మాత్రమే ఈ సంస్థలు చట్టబ ద్ధంగా వ్యవహరిస్తాయి... ఆ అప్పు, వడ్డీ వసూలు చేసే క్రమంలో చాల చట్ట వ్యతిరేకంగా పనిచేస్తు న్నాయి.. అసలా పాత వడ్డీ వ్యాపారస్తులే సూక్ష్మ ఋణాలనే కొత్త ముసుగులు తొడుక్కుని యిట్లా గ్రూపులేర్పడి మనల్నే గ్రూపు లీడర్లుగా చేసి జుట్లు, జుట్లు ముడేసి మన చేత్తోనే మనకళ్ళు పొడిపిస్తు న్నారు.. ఈ లోగుట్టు తెలీకుండా అప్పులు తీసుకుని అమాయకులు బలయిపోతున్నారు....." రాత్రి వెంటే శ్వర్లు చిన్నాయిన చెప్పిన మాటలు మదిలో మెది లాయి అందరికీ.

అసలు మన రాష్ట్రంలో ఒకదాని తర్వాత మరొ టిగా జరిగి పోతోన్న ఈ ఆర్థిక కార్యకలాపాల మీద సమగ్రమైన చర్చ జరగాలి... పదవుల మీదే తప్ప పాలకులకు పేదల గురించి పట్టని పద్ధతి మారాలి. వారిని పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చే సర యిన మార్గాన్ని వెతకాలి.. తన ఆలోచనకి తనకి నవ్వొచ్చింది భాస్కర్‌కి.

రాత్రంతా వేడితో ఉడికించి ఉడికించి క్షణం పాటు దయతల్చిన దానిలా ఒక మలయమారుతం ఝుప్పున వచ్చి భాస్కర్ ముఖాన్ని తాకింది...

"ఎంత సేపట్టు కూర్చుంటావమ్మా పడుకో.. నాలుగయి పోయినట్టుంది... నువ్వు కూడ పొయి పడుకోపోనా.. ఎట్ట జరిగితే అట్ట జరగతాది.. మన చేతుల్లో ఏముండాది చెప్పు పో భాస్కరన్నా పడుకో పో..." కసిరినట్టుగా ధైర్యాన్నిచ్చింది వసంత...

అప్పటికే జోగుతోన్న నీరజ చప్పున చాపమీది వొరిగింది అక్క మాటలతో...

తల్లిని మెల్లిగా చాపమీద పడుకోబెట్టి వాకిట్లో కొచ్చి చూరుకింది పాతకుర్చీలో కూలబడ్డాడు భాస్కర్... ఇంటిల్లి పాదినీ ఆత్మహత్యదిశగా నెట్టినం దుకు కృంగిపోతూ తల్లీ, చెల్లెళ్ళ దుఃఖాన్ని గుత్తకు తీసుకున్న వాడిలా వున్నాడతడు.

ఎక్కడయినా సరే నగరాల్లోగానీ, పట్టణాల్లోగానీ శివార్లలో బతికే దిగువ మధ్యతరగతికి నిర్దిష్టమైన ప్రభుత్వ పథకాలంటూ వుండవు. వున్నా వాళ్ళకి తెలీవు. తెలిసినా వాళ్ళ దాకా రావు... కలిగా పులమైన ఆలోచనలు చేస్తూ మౌనంగా వెనక్కి వాలి కళ్ళుమూ సుకున్నాడు భాస్కర్.

"ఏంది భాస్కరా రేప్పొద్దన్న స్పందనోస్తే ఎట్ట చెయ్యాలం బిడ్డ నెట్ట యిడిపించుకోవాల.. మీ అక్క బతి కేట్టులేదు.." ఎదురింటి ప్రభాకరం కూడా నిద్ర పోయిన ట్టుగా లేదు.. వచ్చి అరుగుమీద కూర్చుంటూ అన్నాడు... "పోలీస్ కంప్లెయింటిస్తే తీసుకుంటారా?... బిడ్డనిప్పిస్తారా?" భయ భయంగా వుందతడి గొంతు.

భాస్కర్‌కి జాలిగా అన్పించింది ప్రభాకరాన్ని చూస్తోంటే...

"చూద్దాంలేన్నా... మొన్నామధ్య కృష్ణా జిల్లా కలె క్టరు మొత్తం ఈ సంస్థలన్నింటినీ మూయించి వేశా డంట... మనబోటోళ్ళంతా మన జిల్లాలో కూడ కలెక్టరు వద్దకు పోయి ఈ సంస్థలమీద కంప్లెయింటిచ్చి అప్పులు మాఫీ చేయమని అడగాలనుకుంటున్నారు.. లేదా మార టోరియం విధించమని అడుగుతారు... ఏదో ఒకటి తప్పక జరగుతుంది లేనా.. తప్పక బయట పడతాం.." ప్రభాకరాన్ని ఓదార్చడానికి ప్రయత్నించాడు.

"నాకు చచ్చి పోయవాలన్పిస్తోంది భాస్కరా" రెండు అరచేతుల్ని ముఖానికి అడ్డంగా చేర్చి ఏడవసా గాడు ప్రభాకరం.

"డబ్బులు కట్టి యిడిపించుకుంటే యిడ్పించుకో లేదంటే కిరసనాయిలు పోసుకుని అంటించుకోవాల అప్పన్నా కట్టాల... ఆత్మహత్యన్నా చేసుకోవాల "స్పందన సంస్థ ఏజంటు సురేష్ విశాలని విదిం చింది కొడ్తూ అన్న మాటలు యిద్దరి మనసుల్లోనూ మెదులుతున్నాయి.

ఊళ్లో చాలమంది ఆడవాళ్ళు ఈ అవమానం భరిం చలేక దొంగతనాలు చేయడమో, ఊరొదిలి వలసపోవ డమో, ఆత్మహత్యలు చేసుకోవడమో జరుగుతోంది.. అదీ కాకపోతే వారం కంతులు కట్టడం కోసం పుస్తెలూ, బిందెలూ, ఒళ్ళూ కూడ అమ్ముకుంటోన్న స్థితి....

ఓదార్చేవాళ్ళు లేక అదేపనిగా ఏడవనూ లేక తనకి తానుగా దుఃఖాన్ని ఆపుకున్నాడు ప్రభాకరం మెల్లిగా అదే అరుగుమీద ఒరిగి పడుకుంటూ...


"అవున్లేన్నా ఎవరూ ఏమీ చేయరు... మనమే ఏదో ఒకటి చేయాల... తప్పకుండా చేద్దాం" ఏదో గట్టి నిర్ణయం తీసుకున్న వాడిలా వున్నట్టుండి అన్నాడు భాస్కర్.. అతడి కళ్ళల్లో ఏదో నిర్భీతితో కూడిన వెలుగు.

***

"భారతీ.. భార్తీ.. అమ్మే నామాటినమ్మా.. వద్దమ్మా.." పక్కింటి తలుపు నెవరో దబదబా బాదు తోన్న చప్పుడు... భారతిని అహర్నిశలూ కనిపెట్టుకుని వుంటుండిన భారతి తల్లికి అప్పుడే కన్నంటుకుం దేమొ లేచి గుండెలు పగిలేలా అరుస్తోంది...

ఆ రోజు సూర్యుడి రాకని తెలపడానికి కాకులు కాకుండా ముందుగా గద్దలొచ్చి ఆ వాడ చుట్టూ తిరు గుతూ ఆకాశాన్ని అల్ల కల్లోలం చేస్తున్నాయి...

తుప్పుపట్టిన పాతకుర్చీలో జోగుతుండిన భాస్కర్ పైకి లేవబోయి నిలదొక్కుకుని, కాళ్ళనిండా శక్తిని నింపుకుని తల విదుల్చుకుంటూ పక్కింటి కేసి కదిలాడు..



రెప్పలు బలవంతంగా విడదీసుకుంటూ అరుగు మీద లేచి కూర్చున్న ప్రభాకరమూ భాస్కర్ని అనుసరించాడు...

"నిన్న సాయంత్రం కూడ మా యింటికొచ్చి ఎన్ని మాటలు చెప్పింది"

"రాత్రి కొళాయి కాడ కనపడి రేపు మూడు వారాల కంతులు కలిపి కట్టేస్తానని చెప్పిందిమే" గొంతులో చెప్పలేనంత ఆశ్చర్యం...

అప్పటికే వాకిళ్ళలోని చీకట్లని చీపుర్లతో తోస్తోన్న ఆడవాళ్ళు ముగ్గు బుట్టలతో సహా భారతి యింటి ముందు చేరారు. వీధి కొళాయి నుండి నీళ్ళు మోస్తోన్న మగవాళ్ళు కావిళ్లని విసిరి తలుపు బలవంతంగా తెరవడానికి ప్రయత్నిస్తున్నారు.

దూలానికి వేళ్ళాడుతోన్న భారతిని చూసి నోటి మాట రాకుండా నిశ్చలన చిత్రాలాయి పోయారంతా.. భారతి యిటు షేర్లోనూ, అటు స్పందనలోనూ తీసుకున్న అప్పు తాలూకు వారపు కంతులు కట్టలేక భారతి భర్త పూరొదిలిపెట్టి వెళ్ళిపోయాడు... రెండు వాయిదాలు కట్టలేదని సంస్థ ఏజంట్లు భారతిని లైంగికంగా వేధించడం మొదలు పెట్టారు...

"నిన్న మధ్నాల నాకు వందరూపాయలియ్యాల్సుంటే తెచ్చిచ్చి శానాసేపు మాట్లాడింది. రేపు వారపు కంతులన్నీ కట్టేస్తానని కూడ చెప్పింది... యింత కడుపులో పెట్టుకోనుందనుకోలే..."

జరిగిందాన్ని క్రమంగా జీర్ణించుకుంటూ అక్కడ చేరిన ఆడవాళ్ళంతా ఉద్రిక్తంగా మాట్లాడుకుంటున్నారు.. మగవాళ్ళు మెల్లిగా దించిపెట్టిన భారతి శవం మీద పడి తల్లి గోలుగోలున ఏడుస్తోంది..

"ఆ స్పందన వోళ్ళు చెప్పినట్టు ఎవురి దగ్గరయినా పొడుకోనయినా వాయిదాలు కట్టకూడదా?... ఈపిల్ల అప్పు తీసి తినేసి మన ఎదాన దోసి పొయ్యిందే.....మన మ్యాడనుంచి తెచ్చి కట్టాల బిడ్డా పాపా గలోళ్ళం.. మన కిట్టా సావనన్నా వుండాదా?.." భారతి గ్రూపులోని ఆడవాళ్ళిద్దరు వున్నట్టుండి బిగ్గరగా భారతిని శాపనార్థాలు పెడుతూ ఏడవసాగారు...

ఈ వీళ్ళే మొన్నటి వారం భారతిని, అమరావతిని నానా మాటలూ అని పోయారు... నిద్రలేమి వల్లనో... హఠాన్మరణాన్ని తట్టుకోలేకో భాస్కర్ కళ్ళు చింతనిప్పుల్లా మెరుస్తున్నాయి...

ఈ అప్పులు తీర్చుకునే మార్గం యిదేనా?

ఆత్మహత్య మాత్రమే ఋణ విముక్తికి మార్గమా?

అవునవును

అందుకే కదా రాత్రి తాము గుళికల మందు తెచ్చుకుంది.

"లేయ్ ఎవురా యింట్లో?"

భారతి మరణాన్ని ప్రపంచానికి చాటుతోన్న గద్దల గుంపు ఆరుపుల్ని అధిగమిస్తూ ఆ కేక వీధిని వొణికించింది.

స్పందన రాలేదు.

స్పందన మొగుడు వీరయ్య.. సంస్థ ఏజంటు యిద్దరూ మొరటుగా జీపులోంచి దిగుతూంటే వాడి చేతిలోనున్న దుడ్డుకర్ర జీపుకి తగిలి ఠంగు ఠంగు మంటూ శబ్దం చేసింది.

వాళ్ళరాకతో కంతులు కట్టాల్సిన ఆడవాళ్ళంతా కాళ్ళు చేతులు ఆడక అటు, ఇటు తిరగసాగారు.

అప్పటికే అమరావతి యింట్లో కెళ్ళిన ఏజంటు వసంత చేతిని పట్టుకుని బయటికి లాక్కొచ్చాడు.

"ఈ రోజు తప్పకుండా కట్టేస్తామన్నా... వొద్దలండి.. యింకా టయిమవల్యా..." బతిమాలుకుంటోంది వసంత.

జరుగుతున్నది క్రమంగా బుర్రలో కెక్కాక ఒక్క క్షణం కూడ ఆలస్యం, చేయలేదు భాస్కర్.... భారతి యింటి ముందు నుండి పరిగెత్తుకుంటూ వెళ్ళి చేతికందిన పాతకుర్చీ తీసి బలంగా ఏజంటుమీదికి విసిరాడు.

అసహాయత ఆగ్రహంగా మారిన క్షణమది.

ముందే మాట్లాడి పెట్టుకున్నట్లుగా అసంకల్పితంగా భారతి యింటిముందు గుమికూడిన ఆడవాళ్ళు, మగవాళ్ళు చెప్పులూ, చాటలూ, ముగ్గుబుట్టలూ, బిందెలూ, కావడికర్రలూ పట్టుకుని ఏజంటు మీదికి, వీరయ్య మీదికి దాడికి దిగారు.

"ఎయంగ్రా.. ఎయిండి..." గందరగోళంగా అరుపులు.

ఇది నిజంగా ఎవరూ వూహించనిది.

వాళ్ళచేతిలో కర్రలే లాక్కుని వాళ్ళ జీపుని కుళ్ళబొడిచారు.

"పొంగ్రా ఎదవ నాయాళ్ళలారా.. యింక ఈదిలోకి అడుగుపెట్టారంటే చస్తారు మాచేతుల్లో ఏవను కుంటూ వుండారో ఒక్క పైసా కూడ కట్టం ఎవురికి చెప్పుకుంటారో చెప్పుకోబోండి" అరుస్తున్నాడు ప్రభాకరం ఒళ్ళుమరిచి...

వీరయ్య కొంత ఎదురుతిరిగాడు కానీ దుడ్డుకర్ర నాట్యం చేయడంతో చెప్పులు కూడ వదిలి పరిగెత్తారిద్దరూ..

"కన్ను లొట్టపోయింది. ఇంక తిరిగి కూడ చూడరు" అంటూన్నారెవరో.. ఆడవాళ్ళంతా ఆనందంతో నాట్యం చేయసాగారు.

అప్పటికి తేరుకుంది అమరావతి.

"ఇంకెప్పుడూ షేర్ వాళ్ళకిగాని, స్పందన వాళ్ళకిగాని కంతులు కట్టగూడదు.." మరెప్పుడూ వాళ్ళ దగ్గర అప్పులు తీసుకోకూడదు.. అంటూ వాగ్దానం చేయమని చేతులు చాపింది.

ఆమె కళ్ళల్లోనుండి నీళ్ళు ధారాపాతంగా కారుతూనే వున్నాయి.

అంతా ఒక్కొక్కరుగా వచ్చి అమరావతి చేతిలో చెయ్యేసి వాగ్దానం చేశారు....

అప్పటికి పూర్తిగా తెల్లవారి పోయింది.

తూర్పును పిండి ఎర్రచారికలతో వున్న మబ్బుల్లో నుండి చొచ్చుకొస్తోన్న సూర్యుడు ఆ వాడ మీద వెలుతురు జలపాతాన్ని ప్రవహింపచేస్తున్నాడు..

*

రచయిత సెల్ నెం: 98485 41485

# స్రవంతి

మల్లెపూలు....

నా ప్రపంచం ఇంత శాంతంగా... ఆహ్లాదకరంగా మారినప్పటినుండి... వీరంతా అడుగుతున్నారు! ఇంత ఆహ్లాదం చేసిందెవరని...?

నాకింత ప్రశాంతత అనుభవమైనప్పటి నుండి వీళ్ళంతా ఆక్రోశిస్తున్నారు. ఇంత శాంతి నీకు ప్రసాదించినదెవరని..?

నా కళ్లింత తేజోవంతంగా మారినప్పటి నుండి వీళ్లంతా కన్నీళ్లు పెట్టు కుంటున్నారు. ఇంత తేజస్సు కలిగించే సౌందర్యాన్ని ఎక్కడ చూశావు అని?

నా పెదాలమీద చిరునవ్వు చెదరనప్పటి నుండి ఏడుపు ముఖాలతో వీళ్లంతా అడుగుతున్నారు. ఇంత ఆనందం నీకెలా వచ్చిందని?

నేనందరితో ప్రేమగా ఉన్నప్పటినుండి దుఃఖంతో ద్వేషంతో ఈర్ష్యతో వీళ్లంతా అడుగుతున్నారు. ఇంత ప్రేమ నీకు ఎక్కడ దొరికిందని?

నేను చెప్పలేకుండా ఉండలేక పోతున్నాను. ఎలా చెప్పాలో అర్థం కాక తల్లడిల్లి పోతున్నాను. ఇన్ని ఆనందాలని నాకు ఒక్క చూపుతో, నవ్వుతో నా దోసిట్లో పోసిన నీ గురించి అర్థమయ్యేట్లు చెప్పగలనా నేను! నిజంగా నిన్ను అర్థం చేసుకుంటారా వీళ్లు?.... నువ్వు... నా.. నువ్వు.....!

భూమిపైన పుట్టగానే నీ మీద విహారంతో నేను పెట్టిన తొలికేకకు బదులుగా బిగ్గరగా రోదించిన నీకు చనుబాలను ఆశ చూపించి మాయచేసి, దూరం చేసిన వీళ్లు....

దుమ్ములో ధూళిలో విశృంఖలంగా తిరుగుతూ, నీ కోసం వెదుకుతున్న నాకు నువు కనిపించకుండా మేడల్లో దాచేసిన వీళ్లు.

తిరిగిన ఊళ్ళలో, ఆడుకున్న స్నేహితుల్లో మారిన తరగతి గదుల్లో.... చదివిన పుస్తకాల్లో... ఎక్కడా నువ్వు నాకు కనిపించకుండా జాగర్తపడ్డారు. కాని నిన్ను దగ్గరికి రానీయకుండా నిన్ను నేను కనిపెట్టకుండా ఆపగలిగారా...?

నా మాటల్లో నీ ప్రస్తావన లేకుండా చేయగలిగారా...?

నా పాటల్లో నీ ప్రచోదన లేకుండా చేయగలిగారా...?

కలల పానుపుపై అలసి నీ కోసం నే ఆలపించిన గానానికి పరుగుపరుగున వచ్చిన నిన్ను ఆపగలిగారా? ఇంకెందుకు వీళ్లందరికీ నీ గురించి చెప్పడం? నాతో నవ్వే నువ్వు... నా దుఃఖాన్ని తొలగించే నువ్వు నాకు ప్రేమైక ప్రపంచాన్ని చూపిన నువ్వు... నాకు ఆనందపు అంచులు చూపిన నువ్వు... నాకే స్వంతమైన నువ్వు... నా ఊహల ఊయలలో ఊగి ఊగి తుళ్లే నీకు మాత్రమే ఈ మల్లెపూలు...

అవును నిజంగా నీకే...

–దామా మురళీకృష్ణ

సెల్: 94404 84972